# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మైక్రో సాఫ్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్‌తో సమావేశమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **జీవితంలో క్రీడలను ఒక భాగంగా చేసుకోవాలని పేర్కొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు.**

3. **విశాఖపట్నంలో ఘనంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ -ఐఎస్ఆర్, మిలాన్-2026 వేడుకలు.**

4. **వ్యవసాయం, పరిశ్రమలు వంటి రంగాలకు ప్రోత్సాహం అందించేలా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందన్న గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ఈరోజు సమావేశం అయ్యారు. బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలికారు. అనంతరం వారితో బిల్‌గేట్స్ బృందం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ -ఆర్టీజీఎస్ కేంద్రాన్ని బిల్‌గేట్స్ సందర్శించారు. ఆర్టీజీఎస్ విధానాలు, సాధిస్తున్న ఫలితాలు, డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానం వంటివి బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై బిల్‌గేట్స్‌తో చర్చించించారు. అలాగే గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి చర్చించారు.

--------------------------

జీవితంలో క్రీడలను ఒక భాగంగా చేసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ఎర్రంనాయుడు ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించే క్రికెట్ పోటీలను కేంద్ర మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఈగల్ టీమ్ రూపొందించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక గోడ పత్రికను ఆవిష్కరించారు. దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలో 14 కోట్ల రూపాయలతో పాత్రునివలస వద్ద క్రీడా మైదానాన్ని నిర్మిస్తామని.. దశల వారీగా మరో ఆరు మైదానాలు అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్రమంత్రి వివరించారు.

--------------------------

విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ -ఐఎస్ఆర్, మిలాన్-2026 వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగర తీరంలో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, ట్యాంకర్లు, హెలికాప్టర్లు పలు విన్యాసాలు ప్రదర్శించాయి. ఐఎన్ఎస్ సముద్రిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్ ను తూర్పు నౌకాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నౌకాదళ అధికారుల మధ్య స్నేహభావం, సాంస్కృ తిక అనుబంధం బలోపేతమయ్యేందుకు మిలాన్ విలేజ్ దోహదపడుతుందని అన్నారు. ఈ నెల 19న నిర్వహించే నగర కవాతులో 45 దేశాల మర్చంట్ కంటెంజెంట్స్ పాల్గొంటాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు, ఎల్లుండి విశాఖపట్నంలో పర్యటిస్తారని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి తెలిపారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఇంటిలిజెన్స్ డిఐజి ఆరిఫ్ హఫీజ్ తో కలిసి ఐఎన్ఎస్ డేగాలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ, రేపు సాయంత్రం రాష్ట్రపతి వాయు మార్గం ద్వారా ఐ ఎన్ ఎస్ డేగాకు చేరుకుంటారని, రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతం పలుకుతారని తెలిపారు. అనంతరం18వ తేదీ ఉదయం అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ – ఐఎఫ్ఆర్ లో పాల్గొంటారని, అదే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

వ్యవసాయం, పరిశ్రమలు వంటి రంగాలకు ప్రోత్సాహం అందించేలా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర బడ్జెట్ పై కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మంత్రి నిన్న పాత్రికేయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి కీలక మైన వ్యవసాయ రంగానికి 13వేల కోట్లు, నీటి పారుదల రంగానికి 18,224 కోట్ల రూపాయాలు కేటాయించడం జరిగిందని అన్నారు. మూలధనం కోసం 50వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం హర్షనీయమని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం సింగనపల్లి వద్ద జరుగుతున్న నాలుగు లైన్ల జాతీయ రహదారి పనులను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వై.ఎస్.ఆర్. కడప జిల్లా బయ్యనపల్లె నుంచి సింగనపల్లె వరకూ 66 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ రహదారి పూర్తయితే నెల్లూరు జిల్లా నుంచి రాయలసీమకు అనుసంధానం మరింత పెరుగుతుందని మంత్రి వివరించారు .

---------------------------

రెండు రోజుల విరామం అనంతరం రాష్ట్ర శాసన సభ , శాసన మండలి బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 వ తేదీన గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాల సందర్భంగా ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేయడం ., 14 వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2026 – 27 సంవత్సర ఆర్థిక బడ్జెట్ ను సమర్పించడం వంటి ప్రధాన కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా రేపు, ఎల్లుండి బడ్జెట్ పై చర్చ జరుగుతుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ నెల 18 వ తేదీన బడ్జెట్ పై జరిగే చర్చకు సమాధానం ఇస్తారు. ఈ వారంలో అసెంబ్లీ పలు ప్రధాన బిల్లులను ఆమోదించే అవకాశం ఉంది.

---------------------------

మహాశివరాత్రిని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో వరాహనది ఉత్తర వాహిని తీరానికి భక్తులు పోటెత్తారు. రాత్రి జాగరణ చేసిన భక్తులు ఈ రోజు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వరాహనది తీరానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామి వారిని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు దర్శించుకున్నారు. ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

---------------------------

ప్రముఖ రచయిత , తెలుగు పత్రికా రచనలో గొప్ప సంపాదకులుగా పేరుపొందిన నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి ఈ రోజు 1908వ సంవత్సరం డిసెంబర్ ఒకటవ తేదీన కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో జన్మించిన ఆయన వేమన పద్యాల శైలిలో "వాస్తవమ్ము నార్ల వారి మాట" అనే మకుటంతో సమాజంలోని రుగ్మతలపై పద్యాలను రచించారు."సీత జోస్యం", "జాబాలి" వంటి నాటకాలను రాశారు. సీత జోస్యం నాటకానికి ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా కూడా పనిచేశారు. ఆయన రాసే సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా, ఆలోచింపజేసే విధంగా ఉండేవి. 1985 వ సంవత్సరం ఫిబ్రవరి 16 వ తేదీన నార్ల వెంకటేశ్వరరావు తుది శ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 20వ తేదీ వరకు పంపవచ్చు.

======================